సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం, 27, డిసెంబర్, 2023



ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం : శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది.



సిరులతల్లికి విశేష పూజలు

మార్గశిర మాసోత్సవాల సందర్భంగా విశాఖలోని కనకమహాలక్ష్మికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు.

8లో



చెక్ పోస్టు ప్రారంభం

రాజవొమ్మంగి: జడ్డంగి పోలీస్ స్టేషన్ ఎదుట హైవేపై ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఏఎస్పీ జగదీష్ అడహాళి ప్రారంభించారు.

న్యూస్‌రీల్

జాయింట్ కలెక్టర్ కార్తీక్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కార్తీక్

సాక్షి,పాడేరు: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కొల్లబత్తుల కార్తీక్ మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా మోదకొండమ్మతల్లి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి, తన జాయినింగ్ రిపోర్ట్‌ను అందజేశారు. జిల్లాలోని పరిస్థితులు, నిర్వర్తించవలసిన విధులను కలెక్టర్ సుమిత్‌కుమార్.. జేసీకి సమగ్రంగా వివరించారు. 2020 బ్యాచ్‌కు చెందిన కార్తీక్ శిక్షణ అనంతరం వైఎస్సార్ కడపజిల్లా, శ్రీసత్యసాయి జిల్లా పెనుగొండలో సహాయ కలెక్టర్‌గా పనిచేశారు. ప్రభుత్వం అల్లూరి జిల్లా జేసీగా బదిలీ చేయడంతో ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. జేసీ కార్తీక్‌ను రెవెన్యూ అధికారులు, ఇతర సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు.

పీవీటీజీలకు పక్కా గృహాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అర్హులైన పీవీటీజీలకు ప్రధానమంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద పక్కా గృహాలను మంజూరు చేస్తున్నట్టు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ గృహాల మంజూరుకు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సర్వే చేస్తున్నట్టు చెప్పారు. ఈ నెలఖరులోగా సర్వే పూర్తి అవుతుందని, అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. హుకుంపేట మండలంలో 72 హెబిటేషన్లలో 1,654 మంది లబ్ధిదారులున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, హౌసింగ్ ఏఈ గౌరీశంకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, తెడబారికి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుతున్న జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద న్యాయమూర్తికి అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.

వైద్యారోగ్య శాఖలో 8 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట(విశాఖ): వైద్య ఆరోగ్యశాఖలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. జోన్–1 పరిధిలో మొత్తం 8 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ సుజాత తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల్లోని ఖాళీలను భర్తీ చేస్తున్నామని.. నెలకు రూ.25వేలు వేతనంగా అందిస్తామన్నారు.బీఎస్సీ(నర్సింగ్),బీఎస్(నర్సింగ్, సీపీసీహెచ్) చేసిన వారు ఈ పోస్టులకు అర్హులున్నారు. https:// nagendr asvst. wordpress. comలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని.. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 28 నుంచి జనవరి 12వ తేదీ లోగా డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలోని రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో అందజేయాలని ఆర్డీ సుజాత కోరారు.

కోలాహలంగా క్రీడా సంబరాలు



వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

- అట్టహాసంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు
- జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో ఘనంగా ప్రారంభం
- ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు
- క్రీడాకారులకు యూనిఫాం, క్రీడాపరికరాల పంపిణీ



పాడేరులో ఆడుదాం ఆంధ్రా పోటీల ప్రారంభం సందర్భంగా బెలూన్లను వదులుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు



బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఎంతో అట్టహాసంగా పండగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఎక్కడ చూసినా క్రీడాకారుల కోలాహలమే కనిపించింది. రంగురంగుల బెలూన్లను ఎగురవేస్తూ ఈ సంబరాలను ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. విజయకాంక్షతో ఉరకలేస్తున్న క్రీడాకారులు పోటీల బరిలో ఉత్సాహంగా దిగారు. జిల్లాలోని 22 మండలాల్లోని 352 గ్రామ సచివాలయాల్లో ఈ పోటీలను తొలిరోజు ప్రారంభించారు. జిల్లాలోని 338 క్రీడా మైదానాల్లో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నారు. అన్ని మండలాల్లోని గ్రామ సచివాలయాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఈ పోటీలను ప్రారంభించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 10 వరకు 47 రోజుల పాటు క్రీడా సంబరాలు జరుగనున్నాయి.

అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు తేవాలి

గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి, వారికి తోడ్పాటు అందించి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం శుభపరిణామమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులతో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీల్లో విజయం సాధించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని కోరారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులను, యువతను ప్రోత్సహించేందుకు ఇంత పెద్ద కార్యక్రమం తలపెట్టారన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించిన సందర్భాలు లేవన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ కోసం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. క్రీడల్లో అందరినీ భాగస్వామ్యం చేయడం శుభపరిణామని చెప్పారు.అనంతరం క్రీడాకారులను అతిథులు పరిచయం చేసుకుని, కొద్ది సేపు క్రికెట్ ఆడారు. ఆడుదాం ఆంధ్రా యూనిఫాం ధరించి పరుగు పోటీల్లో పాల్గొన్నారు. కొద్ది సేపు వాలీబాల్, కబడ్డీ ఆడి క్రీడాకారులు, యువతను ఉత్సాహపరిచారు. క్రీడాకారులకు యూనిఫాం, క్రీడా పరికరాలను పంపిణీ చేశారు.

అంబాసిడర్లుగా గిరిజన క్రీడాకారులు

జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన జిల్లా గిరిజన క్రీడాకారులను ఆడుదాం ఆంధ్రా పోటీలకు అంబాసిడర్లుగా నియమించారు. జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన గ్రామ సచివాలయ ఉద్యోగి పలాసి శ్రీనివాస్, ఆర్చరీ క్రీడాకారుడు సుండ్రుపుట్టు గ్రామానికి చెందిన మజ్జి బైరాగి నాయుడు, మోదమాంబ హైస్కూల్ ఆర్చరీ విద్యార్థి యశస్వినిలను అంబాసిడర్లుగా నియమించారు. ఈ కార్యక్రమంలో కొత్తగా వచ్చిన జాయింట్ కలెక్టర్ కార్తీక్, బదిలీపై వెళ్తున్న జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్, డీఎస్‌డీవో ఎ.జగన్‌మోహన్‌రావు, ఎంపీపీ సొనారి రత్నకుమారి, డీఆర్డీఏ పీడీ మురళి, తహసీల్దార్ వంజంగి త్రినాథ నాయుడు, ఎంపీడీవో సాయినవీన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర తదితరులు పాల్గొన్నారు.



గోమంగిలో వాలీబాల్ ఆడుతున్న గిరిజన క్రీడాకారులు



పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు



కొత్తవలస బాలుర పాఠశాలలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

41 మందికి డి-పట్టాల పంపిణీ



డీపట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: ప్రతి గిరిజనుడి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకే దున్నుతున్న భూములు వారికే చెందాలన్న ఉద్దేశంతో ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు, డీ పట్టాలను ప్రభుత్వం అందజేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పలు గ్రామాలకు చెందిన 41మంది రైతులకు 73 ఎకరాల అసైన్డ్‌భూములకు డీ పట్టాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో రైతులకు అందిస్తున్న అసైన్డ్‌భూములను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, తహసీల్దార్ కె.అప్పలస్వామి, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సీదరి కొండబాబు, వెంకటరమణ, ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండంనాయుడు, పాడేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ఎం.గాయత్రి, జేసీఎస్ మండల కన్వీనర్ ఎల్.కళ్యాణం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

పాడేరు : స్థానిక తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. 117 పాఠశాలలకు చెందిన విద్యార్థులు 117 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎనిమిది థీమ్స్‌కు సంబంధించిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాలలు ఈనెల 28, 29 తేదీల్లో కడప జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనున్నాయి. భౌతిక, రసాయన శాస్త్రాల్లో హుకుంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు, జీవశాస్త్రంలో తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు, ఎన్విరాల్‌మెంటల్ సైన్స్‌లో బొయితిలి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు, సైన్స్ అండ్ టెక్నాలజీలో బంధవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలికలు, మేథమెటిక్స్‌లో జి.మాడుగుల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలికలు, వ్యక్తిగత ఉపాధ్యాయ విభాగంలో కిముడుపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు ప్రథమ స్థానాల్లో నిలిచారు. వీరికి నిర్వాహకులు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యశాఖాధికారి బి.గౌరీశంకర్‌రావు, డిప్యూటీ డీఈవో ఎస్.చెల్లయ్య, ఏడీ జి.అప్పారావు నాయుడు, డీఎస్‌వో టి.నాగేశ్వరరావు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు, అన్ని పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు అరెస్టు



చోరీ వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామారావు

ఎటపాక: విలీన మండలాల్లో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైరు చోరీ చేస్తున్న దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎటపాక సీఐ రామారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని మంగువాయి, కొత్తకొండేపల్లి గ్రామాలకు చెందిన నలుగురు యువకులు గతంలో విద్యుత్‌శాఖలో లైన్లు, ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు పనులకు వెళ్లేవారు. ఆ అనుభవంతో ఎటపాక మండలంలో 20, కూనవరంలో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్లి అమ్ముకుని జల్సాలు చేసుకున్నారు. రైతుల ఫిర్యాదుతో పోలీసులు ప్రత్యేక విచారణ జరిపి నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2.80 లక్షల విలువగల 40 కిలోల కాపర్ వైరు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రామారావు తెలిపారు. ఈకేసును ఎటపాక సీఐ రామారావు, చింతూరు సీఐ గజేంద్ర కుమార్, ఎటపాక ఎస్ఐ కె.పార్థసారథి ఛేదించారు. వీరిని ఎస్పీ తుహిన్‌సిన్హా అభినందించారు.

మరో ఇద్దరికి కరోనా

మహారాణిపేట(విశాఖ): విశాఖలో మంగళవారం మరో ఇద్దరికి కరోనా సోకింది. దీంతో జిల్లాలో కరోనా కేసుల సంఖ్య 11కి చేరుకుంది. ఇద్దరి నుంచి సేకరించిన నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జి.జగదీశ్వరరావు తెలిపారు. గడిచిన 24 గంటల్లో 34 మందికి పరీక్షలు చేయగా.. ఇద్దరికి కరోనా నిర్ధారణ అయినట్లు చెప్పారు. వివిధ అనారోగ్య సమస్యలతో చనిపోయిన మహిళ భర్తతో పాటు 15 మంది కుటుంబ సభ్యులకు పరీక్షలు చేయగా.. అందరికీ నెగిటివ్ వచ్చిందన్నారు. కేజీహెచ్ రాజేంద్రప్రసాద్ వార్డులో చికిత్స పొందుతున్న వ్యక్తికి పాజిటివ్ రావడంతో ఐసోలేషన్ వార్డుకు తరలించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ జి.అశోక్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో ఇద్దరు రోగులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు.

ఆపరేషన్ పరివర్తనతో గంజాయి నిర్మూలన



మాట్లాడుతున్న డీఐజీ ఎస్.హరికృష్ణ

అనకాపల్లి: విశాఖ పోలీస్ రేంజ్ పరిధిలో కొత్తగా ఏడు పోలీస్‌స్టేషన్లను ప్రభుత్వ ఆదేశాలు మేరకు అప్‌గ్రేడ్ చేయనున్నట్టు డీఐజీ ఎస్.హరికృష్ణ అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాన్ని 2021లో ఏర్పాటు చేసి, రేంజ్ పరిధిలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అల్లూరు సీతారామరాజు జిల్లాలో 8 మండలాల్లో ఎక్కువగా గంజాయి సాగు ఉండేదని, వివిధ ప్రభుత్వశాఖల అధికారుల సహకారంతో గంజాయి సాగును నిర్మూలిస్తు, గిరిజన రైతులకు ప్రత్యేక పంటలపై అవగాహన కల్పించామన్నారు. ఆర్‌బీకే కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు అందజేస్తున్నట్టు చెప్పారు. ఒడిశా రాష్ట్రంలో మల్కన్‌గిరి, కోరాపుట్ జిల్లాల నుంచి ఆంధ్ర రాష్ట్రానికి గంజాయి రవాణా జరుగుతోందని, ఎక్కడిక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, రవాణా చేస్తున్న వ్యక్తులపై పీడీ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. కోరాపుట్ డీఐజీతో ఈ అంశంపై ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యక్తులు గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. రేంజ్ పరిధిలో జాతీయ రహదారులపై ప్రమాదాలను ఈ ఏడాది ఎక్కువశాతం నిర్మూలించామని పేర్కొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. అనకాపల్లి డీఎస్పీ నూతన కార్యాలయ పనులు త్వరలో పూర్తి చేస్తామని ఆయన చెప్పారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహాళి




అభ్యర్థులతో మాట్లాడుతున్న ఏఎస్పీ జగదీష్ అదహాళి

రాజవొమ్మంగి: యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు పోలీసు శాఖ తన వంతు కృషి చేస్తోందని ఏఎస్పీ జగదీష్ అడహాళి తెలిపారు. జీడీ పోలీసు శిక్షణ, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ (స్క్రీనింగ్ టెస్ట్)ను రాజవొమ్మంగి స్టేషన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. రాజవొమ్మంగి స్టేషన్ ద్వారా 30 మంది ఈ స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరైనట్టు చెప్పారు. ఏడు మండలాల్లో 75 మంది గిరిజన యువతీయువకులను ఎంపిక చేసి అడ్డతీగల వైటీసీలో 40 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు

ప్రమాదాల నివారణకు చర్యలు

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఎస్పీ చెప్పారు. రాత్రి సమయంలో వాహనాల తనిఖీ ముమ్మరం చేస్తామన్నారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలపై ఇప్పటికే కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రాజవొమ్మంగి, జడ్డంగి స్టేషన్లలో రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలోని రాజుపేట, దాకరాయి, తెల్లకొండలోని 20 ఆదివాసీ కుటుంబాలకు రగ్గులు పంపిణీ చేశారు. సీఐ స్వామినాయుడు, ఎస్ఐ వెంకయ్య, రఘునాథరావు, స్పెషల్ బ్రాంచ్ హెచ్‌సీ దుర్గారావు పాల్గొన్నారు.

మరికొంత కాలం రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు మరికొంత కాలం రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఈ రైళ్లు కాకుండా మిగిలిన రైళ్లు యథావిధిగా నడవనున్నాయి.

రద్దు చేసిన రైళ్లు

జనవరి 1 నుంచి 14వ వరకు గుంటూరు – విశాఖ (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు, జనవరి 2 నుంచి 15 వరకు విశాఖ–గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, జనవరి 1,2,3,5,6,8,9,10, 12,13 తేదీల్లో విశాఖ–విజయవాడ– విశాఖ(22701 / 22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ ఇరువైపులా రద్దు.

రైళ్ల దారి మళ్లింపు

దిగువ రైళ్లు రెగ్యులర్ మార్గమైన విజయవాడ–ఏలూరు–నిడదవోలు మీదుగా కాకుండా మళ్లించబడిన మార్గంలో వయా విజయవాడ–గుడివాడ–భీమవరం టౌన్–నిడదవోలు మీదుగా ఆయా తేదీలలో రాకపోకలు సాగిస్తాయి.

జనవరి 1,8వ తేదీల్లో బయల్దేరే ఎర్నాకుళం–పాట్నా (22643)సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 3,5,10,12వ తేదీలలో బయల్దేరే బెంగళూరు–గౌహతి(12509) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 1,3,5,6,8,10,12,13వ తేదీల్లో బయల్దేరే ముంబయి –భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ధన్‌బాద్‌లో జనవరి 1 నుంచి 14వ తేదీల వరకు బయల్దేరే ధన్‌బాద్–అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్, టాటానగర్‌లో జనవరి 5,12వ తేదీల్లో బయల్దేరే టాటానగర్ – ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్ , టాటానగర్‌లో జనవరి 4,11వ తేదీల్లో బయల్దేరే టాటానగర్ – యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్, హతియాలో జనవరి 2,7,9,14వ వ తేదీల్లో బయల్దేరే హతియా– ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్, జసిద్దిలో జనవరి 3,10వ తేదీల్లో బయల్దేరే జసిద్ది –తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్, హతియాలో జనవరి 1,8వ తేదీల్లో బయల్దేరే హతియా– ఎర్నాకుళం (22837) ఎసి ఎక్స్‌ప్రెస్, హతియాలో జనవరి 6,13వ తేదీల్లో బయల్దేరే హతియా– ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్‌లు ఆయా తేదీల్లో మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు..

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు అదనపు కోచ్‌లను తాత్కాలిక ప్రాతిపదికన జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

విశాఖ–గుణుపూర్–విశాఖ(08522/08521) పాసింజర్ స్పెషల్‌కు జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు థర్డ్ ఏసీ, ఒక స్లీపర్‌క్లాస్ కోచ్‌లను జత చేస్తున్నారు. విశాఖ–బనారస్(18311) వీక్లీ స్పెషల్‌కు జనవరి 3 నుంచి 31 వరకు తిరుగు ప్రయాణంలో బయల్దేరే బనారస్ – విశాఖ (18312) వీక్లీ స్పెస్‌కు జనవరి 4వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను ఆయా రోజుల్లో జతచేస్తున్నారు.

క్లుప్తంగా

సారాతో వ్యక్తి అరెస్టు

అడ్డతీగల: సారా కలిగి ఉన్న మండలంలో లోతావారివీధికి చెందిన కె.అనంతయ్యను మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ అప్పలరాజు తెలిపారు. నిందితుని వద్ద నుంచి ఏడు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య



ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్‌తో నిలిచిన వాహనాలు

అరకులోయ రూరల్: సుంకరమెట్ట ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. మండలంలో సుంకరమెట్ట, గాలి కొండ వ్యూ పాయింట్, కాఫీతోటల వద్ద మంగళవారం ఈ పరిస్థితి నెలకొంది. వాహన రాకపోకలకు గంటల తరబడి అంతరాయం కలిగింది. అరకులోయ అందాలను తిలకించేందుకు భారీగా పర్యాటకులు తరలి వస్తున్నారు. దీంతో రహదారులు, పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అట్టహాసంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

- జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నదే లక్ష్యం
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఐటీడీఏ పీవో అభిషేక్



జి.మాడుగులలో వాలీబాల్, క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



హుకుంపేటలో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఐటీడీఏ పీవో అభిషేక్



వాలీబాల్ ఆడుతూ పోటీలు ప్రారంభించిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: జాతీయ, అంతర్జాతీయ స్థాయికి యువత ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో ఆడుదాం అంధ్రా కార్యక్రమాన్ని ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులు, అధికారులు కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ఈ చక్కటి అవకాశాన్ని గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దారు రాజ్యలక్ష్మి, ఈవోపీఆర్డీ అప్పలరాజు, పార్టీ మండలాధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి భూషన్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, సచివాలయ కన్వీనర్లు అనిల్, సూరిబాబు, నాయకులు కోటిబాబు, జన్ని సింహాచలం పాల్గొన్నారు.

క్రీడాప్రతిభ చాటుకునేందుకు దోహదం

చింతూరు: గ్రామీణ స్థాయిలో క్రీడలు నిర్వహించడం ద్వారా యువత తమ క్రీడా ప్రతిభను చాటుకునేందుకు దోహద పడుతుందని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రభుత్వంగా ఉచితంగా కిట్లు అందచేసి పోటీలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సర్పంచ్ కారం కన్నారావు, తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో రవిబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామలింగారెడ్డి, కోట్ల కృష్ణ, రాంప్రసాద్, మురళి, కార్యదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఆర్పీఎఫ్ కమాండెంట్ సురేష్

క్రీడా ప్రతిభతో రాష్ట్రస్థాయిలో రాణించాలి

జి.మాడుగుల: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని, ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో మంగళవారం ఆడుకుందాం ఆంధ్రా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ క్రీడల్లో 2,769 మంది నమోదు చేసుకోవటం గమనార్హమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎంపీపీ కె పద్మ, వైస్ ఎంపీపీ కె. సత్యనారాయణ, ఎంపీడీవో లోహిత్ జయసాగర్, ఎస్‌ఐ శ్రీనివాస్ సర్పంచ్‌ల ఫోరం గౌరవాధ్యక్షుడు కిముడు రాంబాబు, అధ్యక్షుడు ఎస్ రామకృష్ణ, ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, పాంగి లక్ష్మి, ఈశ్వరరావు, సర్పంచ్‌లు సీదరి కొండబాబు, వెంకటరమణ, మత్స్యంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు, పాడేరు ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ ఎం గాయత్రి సచివాలయల మండల కన్వీనర్ ఎల్ కళ్యాణం పాల్గొన్నారు.

అడ్డతీగలలో ప్రారంభించిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: ఆడుదాం-ఆంధ్రా క్రీడా సంబరం ద్వారా యువతలోని నైపుణ్యానికి పట్టం కడుతున్నట్లు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో రాణించాలనే ఆరాటపడే గిరిజన యువతకు ఇది సదావకాశమన్నారు. క్రీడా ఆణిముత్యాలను ప్రోత్సహించాలనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీటిని ప్రారంభించిందన్నారు. ఏటా ఇటువంటి క్రీడలు క్రమం తప్పకుండా నిర్వహిస్తారన్నారు. అడ్డతీగల మండలంలో 17 గ్రామ సచివాలయాల పరిధిలో 1,746 మంది పేర్లు నమోదు చేసుకోగా, ఆయా క్రీడాంశాల్లో పాల్గొనడానికి 91 జట్లు పోటీపడతాయని ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డపాటు రాఘవ, సొసైటీ చైర్మన్ తోట రాజేశ్వర్రావు, తహసీల్దార్ తోట తాతారావు, మండల జేసీఎస్ కన్వీనర్ నక్కా మోహన్, ఎస్‌ఐ అప్పలరాజు, ఏటీడబ్ల్యూవో ప్రసాద్, ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీలేరు: స్థానిక జెడ్పీహెచ్ స్కూల్ గ్రౌండ్‌లో ఆడుదాం -ఆంధ్రా కార్యక్రమాన్ని సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ యువకులు దీన్ని వినియోగించుకోవాలని కోరారు. సర్పంచ్ దర్లో మాట్లాడుతూ మహిళలకు కబడ్డీ, క్రికెట్ పోటీలను నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, ఉప సర్పంచ్ వల్లీ ప్రసాద్, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

4 నుంచి ఐటీడీఏ కార్మికుల నిరవధిక సమ్మె

అరకులోయ రూరల్: వచ్చే నెల 4 నుంచి ఐటీడీఏ కార్మికుల నిరవధిక సమ్మెకు పిలుపునిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు దాడి రాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతు అరకులోయలో పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం, కొత్తవలస, చింతపల్లి, హెచ్‌ఎన్‌టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డైలీవేజ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్మికుల సంఘం నాయకులు రాంబాబు, రాఘవ పాల్గొన్నారు.

శివ శ్రీనివాస్, శుభం బన్సాల్ సేవలు ఆదర్శనీయం

కలెక్టర్ సుమిత్‌కుమార్



జేసీ శివశ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సాల్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్

సాక్షి,పాడేరు: జాయింట్ కలెక్టర్ జే శివశ్రీనివాస్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సాల్ సేవలు ఆదర్శనీయమని కలెక్టర్ సుమిత్‌కుమార్ కొనియాడారు. జేసీ శివశ్రీనివాస్‌ను బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గాను, రంపచోడవరం సబ్ కలెక్టర్ సుభం బన్సాల్‌ను తిరుపతి జాయింట్ కలెక్టర్‌గాను ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. వీరికి స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ సంఘం మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించింది. శివశ్రీనివాస్, శుభం బన్సాల్‌లకు దుశ్శాలువాలు కప్పి కలెక్టర్‌తోపాటు, పాడేరు ఐటీడీఏ పీవో ఘనంగా సన్మానించారు. పాడేరు మోదకొండమ్మతల్లి చిత్రపటాలను జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూముల రీసర్వే, రెవెన్యూ సేవలు, ధాన్యం కొనుగోళ్లు, వినియోగదారులకు నాణ్యమైన సేవలలో జేసీ శివశ్రీనివాస్ ఉత్తమ సేవలందించారన్నారు. సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్ రంపచోడవరం డివిజన్ పరిధిలో మంచి సేవలు అందించారన్నారు. పోలవరం ముంపు బాధితుల పునరావాసం, కోర్టు కేసులు, జాతీయ రహదారి భూసేకరణ వంటి పనుల్లో ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. వీరిని ఐఏఎస్ అధికారులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నూతన జేసీ కార్తీక్, డీఆర్వో అంబేడ్కర్, ఎస్‌డీసీలు శర్మ, రమణ, రెవెన్యూ సంఘం ప్రతినిధులు చిన్నికృష్ణ, త్రినాథరావునాయుడు, జిల్లాలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

నిశితంగా పరిశీలించి అనుమతులివ్వండి

విశాఖ కలెక్టర్ ఆదేశం

మహారాణిపేట: జిల్లాలో 14 అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టీ), సరోగసీ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన ఏఆర్‌టీ, సరోగసీ జిల్లా కమిటీ, జిల్లా మెడికల్ బోర్డు సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ఈ కేంద్రాలను నిశితంగా పరిశీలించి అనుమతులివ్వాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావును ఆదేశించారు. సమావేశంలో కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి, పిల్లల విభాగ వైద్యుడు డాక్టర్ చక్రవర్తి, ఎన్‌జీవో ఎల్.వి.రమణి, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.జీవన్ రాణి పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై చర్యలు

గొలుగొండ: గంజాయి అక్రమ రవాణాతోపాటు, ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పోలీసులను ఆదేశించారు. ఆయన మంగళవారం గొలుగొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి అక్రమ రవాణాపై పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఆయనతో ఎస్‌ఐ నారాయణరావు ఉన్నారు.

ఎస్‌ఐ పోస్టుకు గిరిజన యువకుడి ఎంపిక

సన్మానించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



తల్లిదండ్రులు శ్రీనివాస్, మంగ్లన్నదొరలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

పాడేరు రూరల్: మండలంలోని గబ్బంగి పంచాయతీ దేవరాపల్లికి చెందిన గిరిజన యువకుడు సీదరి శ్రీనివాస్ ఎస్‌ఐ పోస్టుకు ఎంపికయ్యాడు. 2022-23లో ఐటీడీఏ ఆధ్వర్యంలో విశాఖపట్నం వేపగుంటలో ఉచిత సివిల్స్ శిక్షణ పొందాడు. గ్రూపు-1కు ఎంపిక కాలేకపోయాడు. దీంతో ఎస్‌ఐ పరీక్షలు రాసి 216 మార్కులు సాధించి ఎస్టీ విభాగం నుంచి ఎంపికయ్యాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మంగళవారం పాడేరులో శ్రీనివాస్‌ను దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కొడుకు విజయంలో కీలకపాత్ర పోషించిన అతడి తండ్రి మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ్లన్నదొరను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, సర్పంచ్‌లు వంతాల సీతమ్మ, గొల్లోరి నీలకంఠం, గబ్బాడ చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు గిడ్డి విజయలక్ష్మి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు గబ్బాడ రాజారావు, నాయకులు మినుముల కన్నాపాత్రుడు, వేమల గోపి, శంకర్‌రావు పాల్గొన్నారు.

గంజాయి బ్యాగు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగు

యలమంచిలి రూరల్: మండలంలోని సోమన్నపాలెం గ్రామానికి సమీపంలో మంగళవారం రాత్రి గంజాయి బ్యాగును స్వాధీనం చేసుకుకున్నట్లు యలమంచిలి రూరల్ ఎస్‌ఐ కె.సన్నిబాబు తెలిపారు. తమ గ్రామానికి సమీపంలో పాత జాతీయ రహదారి పక్కన బ్యాగులో గంజాయి ఉన్నట్లు గ్రామస్తులు ఎస్‌ఐకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లిన ఎస్‌ఐ ఓ బ్యాగులో ప్యాకెట్లుగా ఉన్న గంజాయిని గుర్తించారు. సమీపంలో ఉన్న నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని, గంజాయి బ్యాగు గురించి ప్రశ్నించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ

పాడేరు: సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం 1925 డిసెంబర్ 26న పార్టీ ఆవిర్భవించిందన్నారు. నేటికీ 99 ఏళ్లు పూర్తి చేసుకోని వందేళ్ల మైలు రాయిని చేరుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. భారత సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర భారతావని పరిరక్షణ కోసం సీపీఐ అహర్నిశలు శ్రమిస్తుందన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలు, గిరిజనుల సమస్యలపై పార్టీ తమ పోరాటాలను కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కూడా రాధాకృష్ణ, జిల్లా నాయకులు భీమలమ్మ, సింహాచలం, చంటిబాబు, నూకరాజు, లక్ష్మణరావు, విశ్వనాథం, కృష్ణారావు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై పోక్సో కేసు

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. చిన్నవాల్తేరు పరిధి రెల్లివీధికి చెందిన బాలుడు సీతంపేటలో బాలికను ప్రేమించాడు. మాయమాటలు చెప్పి కొద్ది రోజుకిందట ఆమెను ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. బాలిక తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యమైనట్టు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి ఇద్దరూ నిడదవోలులో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి నుంచి వారిని నగరానికి తీసుకొచ్చారు. విచారణలో బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తేలడంతో బాలుడిని అరెస్ట్ చేశారు.

సిరులతల్లికి విశేషపూజలు

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 13వ రోజు మంగళవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి సహస్రనామార్చన, సర్వదర్శనం, పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. 108 స్వర్ణపుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ప్రత్యేక పూజలు, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నగరానికి చెందిన చెల్లపిళ్ల మహర్షి, పాతనగరం రాజప్పనాయుడు వీధికి చెందిన ఆనందకుమార్‌చే నిర్వహించిన బుర్రకథ భక్తులను అలరించింది. ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేపల ఎగుమతులు పెరగాలి

మహారాణిపేట (విశాఖ): చేపల ఎగుమతులను పెంచాలని కేంద్ర మత్స్యకార, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా పిలుపునిచ్చారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్‌ఎఫ్‌డీబీ) 10వ పాలక మండలి సమావేశం మంగళవారం నగరంలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో జరిగింది. ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల మత్స్యశాఖ మంత్రులు డాక్టర్ సీదిరి అప్పలరాజు, మంకల్ ఎస్ వైద్య, త్రిపుర, ఉత్తరాఖండ్, పంజాబ్ రాష్ట్రాల మత్స్యశాఖ అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ రొయ్యలకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందన్నారు.

బియ్యం వాహనాల కాటాలకు సీళ్లు



కాటాలకు సీళ్లు వేయిస్తున్న తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శివ బాలాజీ



సీజ్ చేసిన జీసీసీ కాటా

అడ్డతీగల: పౌర సరఫరాల శాఖ అజమాయిషీలో నడిచే బియ్యం వాహనాల్లోని కాటాలకు తూనికలు కొలతల శాఖ అధికారులు మంగళవారం సీళ్లు వేశారు. తూనికలు కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ శివ బాలాజీ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం ఈ చర్యలు చేపట్టారు. స్థానిక జీసీసీ గొడౌన్ వద్ద అడ్డతీగల మండలానికి సంబంధించి ఎనిమిది వాహనాలు, గంగవరం, వై.రామవరం మండలాలకు సంబంధించి రెండేసి వాహనాల్లోని కాటాలకు సీళ్లు వేశారు. సరుకుల పంపిణీలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఉండాలని ప్రభుత్వం ఆదేశాల మేరకు కాటాల పరిశీలన, సీళ్లు వేయడం వంటివి చర్యలు చేపడుతున్నట్లు తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శివబాలాజీ తెలిపారు.

జీసీసీ కాటా సీజ్, రూ.25 వేల జరిమానా

అడ్డతీగల: స్థానిక జీసీసీ గొడౌన్ వద్ద సిబ్బంది అటవీ ఉత్పత్తులు కొనుగోలుకు వినియోగిస్తున్న కాటాలో లోపాలు గుర్తించిన తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శివబాలాజీ సీజ్ చేశారు. ఈ మేరకు ఒకటిన్నర కిలో బరువు తక్కువగా చూపిస్తున్న అంశాన్ని ఆయన గుర్తించారు. దీంతో కాటాను సీజ్ చేశారు. రూ.25 వేల జరిమానా విధించారు.